క్లుప్తంగా

డీఈవో ఆకస్మిక తనిఖీ



మాక్లూర్: మండలం కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు కస్తూర్బా గాంధీ పాఠశాలలను బుధవారం డీఈవో దుర్గా ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్‌లో కూరగాయలు, వంట సరుకుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల మానసిక పరిస్థితిపై కూడా దృష్టిపెట్టి విద్యాబోధన చేయాలన్నారు. పాఠశాల ప్రత్యేక అధికారిణి ప్రగతిని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు.

చెక్కుల పంపిణీ

మోర్తాడ్: ఏర్గట్ల తహసీల్ కార్యాలయంలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీపీ కొలిప్యాక ఉపేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్, సర్పంచ్ గుల్లె లావణ్య, ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ మధులు పంపిణీ చేశారు. తహసీల్దార్ జనార్దన్, కో–ఆప్షన్ సభ్యుడు అశ్రఫ్, నాయకులు గుల్లె గంగాధర్, కటుకం సాగర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

కమ్మర్‌పల్లి: బషీరాబాద్ గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. జుల గంగారాంకు రూ.32 వేలు, కట్ట గంగారాంకు రూ.16 వేలు, నర్రా లక్ష్మికి రూ.20 వేలు ఆర్థిక సహాయం మంజూరు కాగా, సంబంధించిన చెక్కులను నాయకులు బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. సర్పంచ్ అశోక్, ఉప సర్పంచ్ విక్రమ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బైకాని మహేష్ పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి బీఆర్ఎస్ చేయూత



కమ్మర్‌పల్లి: మండల కేంద్రం శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న బాధితులు లోలం గజేందర్‌కు బీఆర్ఎస్ పార్టీ చేయూత అందించింది. గజేందర్ శస్త్ర చికిత్స నిమిత్తం రూ.8 లక్షలు అవసరం కాగా, బీఆర్ఎస్ నాయకులు సర్పంచ్ స్వామి రూ.5 వేలు, కత్తి శ్రీను రూ.5 వేలు, బద్రి రూ.3 వేలు, గోపిడి రమేష్ రూ.3 వేలు, సుధాకర్ రూ.2 వేలు, సుంకరి మురళి రూ.2 వేలు, కుమ్మరి భూమేశ్వర్ రూ.2 వేలు ఇతర దాతలు కలిపి రూ. 31,500 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

నిబంధనలకు అనుగుణంగా మొక్కలు పెంచాలి

బోధన్ రూరల్(బోధన్) : ప్రభుత్వ నర్సరీలో నిబంధనలకు అనుగుణంగా మొక్కలు పెంచాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సంజీవ్ కుమార్ అన్నారు. బుధవారం లంగ్డాపూర్‌లో సంజీవ్ కుమార్ పర్యటించి నర్సరీను సందర్శించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ పవన్ ఉన్నారు.

దోమల్ని అరికట్టండి

నవీపేట: నవీపేట మేజర్ జీపీ పరిధిలోని అన్ని వార్డులలో దోమల బెడద ఎక్కువగా ఉందని, నివారణ చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు బుధవారం జీపీ కార్యదర్శి వెంకటరమణకు వినతి పత్రం సమర్పించారు. దోమల బెడదతో రోగాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మైసరాధ, సొసైటీ డైరెక్టర్లు గణేష్, రాము, బాలగంగాధర్, నాయకులు రాజేందర్‌గౌడ్, రాజశేఖర్, ప్రేమ్‌సింగ్, నవీన్ పాల్గొన్నారు.

జూడో పోటీలలో కాంస్యం



ఎడపల్లి(బోధన్): ఠాణాకలాన్ గ్రామానికి చెందిన పెద్దగొన్ కీర్తన అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ 30 కిలోల విభాగంలో నిర్వహించిన జూడో పోటీలలో కాంస్య పతకం సాధించింది. కరీంనగర్‌లో నిర్వహించిన ఈ పోటీలలో పతకం సాధించిన కీర్తన, పీఈటీ అనితను బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా ఉర్సు



బోధన్‌టౌన్(బోధన్): రాకాసీపేట్‌కాలనీలోని సయ్యద్ జమాల్ పాషా ఖాద్రీ రహెమత్ ఉల్లా దర్గాలో మంగళవారం ఉర్సు ఘనంగా నిర్వహించారు. ముత్తావలి సయ్యద్ మోహినొద్దీన్ నివాసం నుంచి గంధం తీసుకు వచ్చి దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ ఉర్సులో ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ ప్రేమ్‌కుమార్, మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నాటుడెందుకు.. నరుకుడెందుకు ?

- గతంలో విద్యుత్ తీగల కింద మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- అడ్డొస్తున్నాయని ఏపుగా పెరిగిన హరితహారం చెట్ల తొలగింపు
- సరైన స్థలాల్లో నాటకుండా లక్ష్యాన్ని పూర్తి చేసి చేతులు దులుపుకున్న వైనం
- ప్రజాధనం వృథా

భీమ్‌గల్: అధికారులు, ప్రజాప్రతినిదులు ఏ పనులు చేసినా ప్రయోజనం ఉండాలి. వాటి ప్రగతి ఫలితాలు పది కాలాల పాటు నిలబడాలి. భీమ్‌గల్ పట్టణ కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల అధికారులు, ప్రజాప్రతినిధుల ఆలోచనలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఎక్కడైతే నేమి మొక్కలు నాటితే చాలు అనే నిర్లక్ష్యపు పనులు చాలా మంది అధికారులు, ప్రజాప్రతినిధుల చేతల్లో కనపడుతున్నాయి. భీమ్‌గల్ మండలంలోని కొన్ని గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరగగానే పైన ఉన్న కరెంట్ తీగలకు తగులుతున్నాయి. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది మొక్కలను మొత్తంగా నరికేస్తున్నారు. చాలా గ్రామాల్లో మొక్కలు నరికివేతకు గురవుతున్నాయి. రోడ్ల ప్రక్కన విద్యుత్ తీగల కింద నాటిన మొక్కలు ఒక స్థాయి వరకు



భీమ్‌గల్ మండలం మెండోరాలో నరికేసిన చెట్లు

పెరిగాక తీగలకు అడ్డుతగులుతున్నాయని కొట్టేయడం సర్వ సాధారణంగా మారింది.

సామాన్యులకు జరిమానాలు..

రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల ఆకులను మేకలు, పశువులు తిన్నప్పుడు వాటి యజమానులకు సంబంధిత అధికారులు రూ.వేలల్లో జరిమానాలు విధించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇవే మొక్కలు మొత్తం నరికివేతకు గురైతే వారిపై చర్యలు తీసుకోవడం లేదు. జరిమానాలు కేవలం సామాన్య ప్రజలకేనా అంటూ అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంతో ఎప్పటికప్పుడు లక్ష్యాల కోసం వెంపర్లాడటం, అనుకున్న విధంగా క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టకపోవడంతో గ్రామాల్లో పచ్చదనం నెలకొల్పాలన్న ప్రభుత్వ అసలు ఆశయానికి గండి పడుతోంది. ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు సమన్వయం చేసుకొని మొక్కల పెంపకం చేపడితే బతికే అవకాశం ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పునరావృతం కాకూడదు



మూగ జీవాలు మొక్కల ఆకులను తింటే వాటి యజమానులకు అధికారులు జరిమానాలు విధిస్తారు. అలాంటిది మొత్తం మొక్కలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. మొక్కలు నరికిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకొని, మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలి. అలాగే హరితహారంలో నాటే ప్రతి మొక్క సరైన స్థలంలోనే నాటాలి. – బేతాల విక్రమ్, భీమ్‌గల్

దృష్టిలోపాలను దూరం చేసుకోండి



చిన్నాపూర్‌లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్



ఆలూర్‌లో ప్రారంభిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

మాక్లూర్: కంటి వెలుగు శిబిరాల్లో తమకు ఉన్న దృష్టిలోపాలపై చికిత్స తీసుకోవాలని ప్రజలకు జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు సూచించారు. అనుభజ్ఞులైన కంటి వైద్యులతో కంటి పరీక్షలు, చికిత్సలు జరుగుతున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం చిన్నాపూర్‌లో విఠల్‌రావు కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం అదే గ్రామంలో నిర్మాణం పూర్తయిన మహిళ మండలి భవనాన్ని విఠల్‌రావు ప్రారంభించారు. ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఎంపీడీవో క్రాంతి, ఎంపీవో శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం అనిల్ కుమార్, మెడికల్ ఆఫీసర్ ప్రకాష్, సర్పంచ్ పుట్ట లక్ష్మీ, ఎంపీటీసీలు ఎం సత్యనారాయణ, గోవూరు ఒడ్డెన్న, శేఖర్‌రావు, గంగారెడ్డి, సుమన్, సుమలతలు పాల్గొన్నారు.

ఆలూర్‌లో కంటి వెలుగు ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. వైద్యులు కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు. సొసైటీ చైర్మన్ కళ్లెం భోజారెడ్డి, వైస్ ఎంపీపీ మోతె భోజకళ చిన్నారెడ్డి పాల్గొన్నారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతన్నలు

ఎడపల్లి(బోధన్): మండలంలో సాగునీటి కోసం రైతులు బుధవారం రోడ్డెక్కారు. సాటాపూర్ గేట్ వద్ద రైతులు దాదాపు గంటపాటు రాస్తారోకో చేపట్టారు. తమ పంట పొలాలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయని, నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలోని డి–46 కాలువ ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించాలని రైతులు డిమాండ్ చేశారు. డి–46 కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టినట్లు రైతులు తెలిపారు. రైతులకు



బోధన్ -నిజామాబాద్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ నచ్చచెప్పి సమస్యను ఆర్డీవోకు వివరించాలని చెప్పడంతో ఆందోళన విరమించారు.

క్రీడాకారులకు దుస్తుల అందజేత



క్రీడాకారులతో పీఈటీలు, తదితరులు

పెర్కిట్(ఆర్మూర్): రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే నిజామాబాద్ జిల్లా బాలికల జట్టుకు పీఈటీ మాధురి బుధవారం క్రీడా దుస్తులను అందజేశారు. మామిడిపల్లి విజయ్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి మానస గణేష్, శ్యామ్ ముఖ్య అతిథులుగా హాజరై దుస్తులను అందజేశారు. విజయ్ హైస్కూల్‌లో ఈ నెల 10 నుంచి 12 వరకు 41వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను నిర్వహించనున్నారు.

రూ.లక్ష వరకు రుణమాఫీ చేయాలి



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మోర్తాడ్: తెలంగాణ ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన విధంగా రూ.లక్ష వరకు పంట రుణం మాఫీని వర్తింపజేయాలని బీజేపీ బాల్కొండ నియోజకవర్గ కన్వీనర్ మల్కన్నగారి మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం మోర్తాడ్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేయడం లేదన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద విధానాలపై బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేష్, నాయకులు మురళిగౌడ్, భోగ దేవేందర్, కుంట శ్రీనివాస్, జైడి గంగారెడ్డి, లక్ష్మి నర్సయ్య, గంధం చిన్నయ్య, ఏలేటి సాయన్న, ప్రవీణ్‌రెడ్డి, సాగర్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలి

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో అత్యవసరమైన చోట విద్యుత్ స్తంభాలను వెంటనే ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో స్తంభాల ఏర్పాటుకు తీర్మానం చేసినట్లు తెలిపారు. 15 రోజుల్లో స్తంభాలను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, మేనేజర్ అయాం, ట్రాన్స్‌కో ఏఈ అశ్రితా రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ సీతారాం పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న చైర్ పర్సన్ వినీత

ప్రజల పోరాటంతోనే ఏసీడీ చార్జీల రద్దు



కమ్మర్‌పల్లి: ఏసీడీ చార్జీల రద్దు ప్రజా పోరాట విజయమేనని సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కమ్మర్‌పల్లిలో మాట్లాడారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణాలో సీఎం కేసీఆర్ ప్రజలపై ఏసీడీ చార్జీల పేరిట భారం మోపారని దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నేరవేర్చకపోగా, వాటికి భిన్నంగా చట్టాలు చేసి హక్కులు కాలరాశారని ధ్వజమెత్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలో విద్యుత్ చార్జీలు పెరిగితే వెంటనే ఉపసంహరించుకోవాలని గొంతు చించుకొని మాట్లాడిన సీఎం కేసీఆర్ ప్రస్తుతం విద్యుత్ బిల్లు ల్లో అడ్వాన్స్ చార్జీలు, అభివృద్ధి చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపుతుండడం శోచనీయమని వ్యాఖ్యానించారు.

కాలువకు మరమ్మతులు చేపట్టాలని వినతి



వర్ని: మండల కేంద్రంలోని వారాంతపు సంత పక్కన ఉన్న నిజాంసాగర్ కెనాల్ డి–31 కాలువకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ బుధవారం వర్ని తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్ కుమార్‌కు సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. డిస్ట్రిబ్యూటరీ కాలువ పూడిక తీయకపోవడంతో నీరు పూర్తిగా రోడ్లపైకి వస్తుందన్నారు. కాలువలో చెత్తాచెదారం చేరడంతో దుర్వాసన వస్తోందన్నారు. నాయకులు లక్ష్మి, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

'బోధన్'ను జిల్లాగా ఏర్పాటు చేయాలి



దీక్షలో కూర్చున్న మండలి సభ్యులు

బోధన్: బోధన్ పట్టణం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు రాకాసీపేట్ సాయి ఆదర్శ యువతి మండలి అధ్యక్షురాలు పద్మాసింగ్, సభ్యులు మద్దతు తెలిపారు. ప్రత్యేక జిల్లా సాధన కోసం న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 52వ రోజుకు చేరాయి. దీక్షలో మండలి సభ్యులు రేణుక, యాదమ్మ, నర్సమ్మ, షేక్ షరీఫా బేగం, తదితరులు కూర్చున్నారు. హైకోర్టు న్యాయవాది వీరభద్రప్ప, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

'డాక్టర్లులేక అవస్థలు పడుతున్నారు'

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి పేరుకే పెద్దాస్పత్రి అని గైనకాలజిస్ట్, ఎముకల డాక్టర్లు లేక రోగులు అవస్థలు పడుతున్నారని యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తలారి నవీన్ కుమార్ విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు ఆస్పత్రిని సందర్శించి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించి ఆస్పత్రి సూపరింటెండెంట్ శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడారు. గైనకాలజిస్టు లేకపోవడంతో గర్భిణులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొందని, ఆస్పత్రిలో స్కానింగ్ మిషన్ లేకపోవడంతో ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లతో పాటు నిజామాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కరోనా సమయంతో పాటు ఇతర సమయాల్లో వైద్య సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్ వైద్యులను, వైద్య సిబ్బందిని ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అసంపూర్తి పనులతో భక్తులకు ఇబ్బందులు

రుద్రూర్: మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయం ఎదుట డ్రైనేజీ నిర్మాణానికి తవ్వకాలు జరిపి అసంపూర్తిగా నిలిపివేయడం వల్ల భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. రెండు నెలల క్రితం ఆలయం వద్ద డ్రైనేజీ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. దీని కోసం జెడ్పీటీసీ సభ్యులు నరోజి గంగారాం రూ.2 లక్షల నిధులు కేటాయించారు. అందులో భాగంగా మురికి కాల్వ తవ్వారు. అనంతరం పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. సమీపంలో ఉన్న వారు అభ్యంతరం చెబుతున్నారని కంకర సైతం ఇతర ప్రాంతానికి తరలించారు. ఆలయం ఎదురుగా కాలువ తీయడం వల్ల భక్తులు అవస్థలు పడుతున్నారు. దైవ దర్శనానికి చుట్టూ తిరిగి వెళ్లాల్సివస్తోంది. మరో పది రోజుల్లో రానున్న మహా శివరాత్రి పర్వదినం రోజు ఆలయానికి భక్తులు విశేష సంఖ్యలో వస్తారు. అసంపూర్తి పనుల వల్ల భక్తులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. త్వరగా పనులు పూర్తి చేయించాలని భక్తులు కోరుతున్నారు.



ఆలయం ఎదుట కాలువ తవ్వి వదిలేసిన దృశ్యం

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

నవీపేట: మారుమూల గ్రామాలలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని బీజేపీ బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అబ్బాపూర్(ఎం)లో బూత్ లెవల్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి పనులకు ప్రచారం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు యువకులు పార్టీలో చేరారు. నాయకులు శ్రీధర్, ఆనంద్, రామకృష్ణ, నాగేశ్వర్‌రావ్, రచ్చ సుదర్శన్ పాల్గొన్నారు.

యూత్ జోడో బూత్ జోడో ఇన్‌చార్జిగా రవీందర్ రెడ్డి



బోధన్ రూరల్/బోధన్‌టౌన్: యూత్ జోడో బూత్ జోడో బోధన్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనా రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దొడ్ల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ..యూత్ జోడో బూత్ జోడో ముఖ్య ఉద్దేశం బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడమన్నారు. పార్టీ నిర్మాణం కోసం బూత్ కమిటీలు పటిష్టం చేయాలన్నారు. మొబైల్ యాప్ ద్వారా ఒక బూత్‌కి ఐదుగురు చొప్పున కార్యకర్తలను ఎన్రోల్మెంట్ చేయాలని చెప్పారు. తనను నియమించినందుకు మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, శివసేనా రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



మాక్లూర్: అడవిమామిడిపల్లి శివారు గుత్ప చౌరస్తా వద్ద గల అపురూప వేంకటేశ్వర ఆలయంలో బుధవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరో మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 వరకు ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆలయ చైర్ పర్సన్ అమృతలత పాల్గొన్నారు.

మంగళ్‌పాడ్‌లో కుంకుమార్చన



ఎడపల్లి(బోధన్): మంగళ్‌పాడ్‌లో బుధవారం విద్యారణ్య భారతి స్వామి, మహిళలతో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కుంకుమార్చనకు హాజరైన మహిళలకు పసుపుతో చేసిన గౌరమ్మలను అందజేశారు. నూతనంగా నిర్మించిన కాళికాదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన, బుధవారం నుంచి శనివారం వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హన్మాన్లు, ఎంపీటీసీ వనజ, ఉప సర్పంచ్ కుంట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

శివాలయంలో పునఃప్రతిష్టాపన ఉత్సవాలు

నవీపేట: యంచలోని పురాతన కేదారీశ్వరాలయంలో బుధవారం వీడీసీ ఆధ్వర్యంలో స్పటిక లింగ పునఃప్రతిష్టాపన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఆలయంలోని స్పటిక లింగాన్ని ఎనిమిదేళ్ల కిందట దుండగులు ఎత్తుకెళ్లారు. తాజాగా వీడీసీ ప్రతినిధులు ముందుకు వచ్చి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈనెల 10 వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని వీడీసీ ప్రతినిధులు పేర్కొన్నారు.

నాణ్యతతో నిర్మిస్తే మన్నికగా ఉంటాయి

- ఎంపీపీ వల్లేపల్లి సునీత

కోటగిరి : మన ఊరు –మన బడి పనులను నాణ్యతతో చేపట్టినప్పుడే అవి పది కాలాల పాటు మన్నికతో నిలుస్తాయని కోటగిరి ఎంపీపీ వల్లేపల్లి సునీత పేర్కొన్నారు. బుధవారం కోటగిరి, పోతంగల్ ఉభయ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల హెడ్ మాస్టర్లు, విద్యాకమిటీ చైర్మన్లు, పనిచేసే కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా పోతంగల్ మండల కేంద్రంలోని స్కూళ్లను సందర్శించిన సందర్భంగా ఇచ్చిన ఆదేశాలను గుర్తు చేశారు. కొత్తపల్లి, కల్లూర్, జల్లాపల్లి, జల్లాపల్లి ఫారంలోని స్కూళ్లలో జరిగిన పనుల గురించి మండల ప్రత్యేకాధికారి రమేష్ వివరించారు. సర్పంచులు, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, డీఈఈ అంజిరెడ్డి, ఎండీవో మనోహర్ రెడ్డి, ఎంఈవో నాగనాథ్ ప్రసంగించారు.



కోటగిరిలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

భాషా పండితుడి నిరసన

మాక్లూర్: పదోన్నతులు కల్పించటంలో కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బుధవారం గంగరమంద ప్రభుత్వ పాఠశాలకు చెందిన భాషా పండితుడు, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ రమణాచారి ఆందోళన చేశారు. తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులకు పదోన్నతులు ఇవ్వకుండా మభ్యపెడుతున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ప్రస్తుతం జరిగే పదోన్నతులు, బదిలీలలో షెడ్యూల్లో కోర్టు కేసులను ఎత్తివేయించి పదోన్నతులు ఇవ్వాలని రమణాచారి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగానే ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు.



భాషా పండితుడు రమణాచారి